తర్వాత ఏమవుతుందో చూడాలనిఉంది..



చేజార్చుకున్న అంగుళీకం కోసం భూలోకానికి ఏతెంచిన ఇంద్రజ.. గైడ్ రాజు ప్రేమలో పడి, చివరకు దేవలోకాన్ని కూడా వదులుకుంది. తన ప్రేమకు అడ్డుగా ఉన్న అంగుళీకాన్ని సముద్రంలోకి విసిరి కొట్టింది. జలధి పాలైన ఆ అంగుళీకాన్ని ఓ మత్స్యం మింగింది. ప్రస్తుతానికి సినిమా సుఖాంతమైంది. 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' క్లైమాక్స్ ఇది. 'మరి ఆ తర్వాత ఏమైంది?' అని ఏ కథకుడైనా ఆలోచిస్తే!? ఇది ఈనాటి కోరిక కాదు, కోట్లాది అభిమానుల దశాబ్దాల ఆకాంక్ష. ఆ మాటకొస్తే.. చిరంజీవి కోరిక కూడా అదే. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని వెల్లడించారు మెగాస్టార్. 'ఆ సినిమాకు సీక్వెల్ రావాలి. అందులో రామ్‌చరణ్, జాన్వీకపూర్ నటించాలి. నేను చూడాలి. ఇది నా చిర కాల కోరిక.' అంటూ తెలిపారు చిరంజీవి. నిజానికి 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' సీక్వెల్‌పై కొన్నేళ్లుగా గాసిప్పులు వస్తూనే ఉన్నాయి. రామ్‌చరణ్ హీరోగా చేస్తున్నారనీ, ఈ సినిమా ద్వారానే జాన్వీకపూర్ తెలుగులోకి ఎంట్రీ ఇవ్వనున్నారని గతంలో వార్తలు కూడా వచ్చాయి. కానీ 'దేవర'తో ఆమె టాలీవుడ్ ఎంట్రీ జరిగిపోయింది. అంతేకాదు, బుచ్చిబాబు సాన చిత్రంతో రామ్‌చరణ్‌తో కూడా జతకట్టేసింది. దాంతో దాదాపుగా 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' టాపిక్‌కి తెరపడ్డట్టయ్యింది. అయితే.. చిరంజీవి మళ్లీ ఈ విషయాన్ని లేవనెత్తడం అభిమానుల్లో చర్చకు తెర లేచింది. ఏది ఏమైనా చిరంజీవి నిజంగా పూనుకుంటే అది పెద్ద పనేంకాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పుత్రికోత్సాహంలో మంచు మనోజ్

హీరో మంచు మనోజ్ తండ్రయ్యారు. ఆయన సతీమణి మౌనికా రెడ్డి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని మనోజ్ సోదరి మంచు లక్ష్మి ఎక్స్ (ట్విట్టర్) ద్వారా తెలిపారు. 'మా ఇంట చిన్నారి దేవత అడుగుపెట్టింది. ఈ పాపను మేము ప్రేమగా 'ఎంఎం పులి' అని పిలుస్తున్నాం. ఆ భగవంతుడి ఆశీస్సులు ఈ కుటుంబంపై ఉండాలని, వారు ఎల్లప్పుడూ సంతోషంగా జీవితాన్ని సాగించాలని కోరుకుంటున్నా' అని మంచు లక్ష్మి తన పోస్ట్‌లో పేర్కొంది. ఈ సందర్భంగా మంచు మనోజ్‌కు సినీ ప్రముఖులతో పాటు నెటిజన్లు అభినందనలు తెలిపారు. పెద్దల అంగీకారంతో గత ఏడాది మంచు మనోజ్- మౌనికలు వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం మనోజ్ 'వాట్ ది ఫిష్' చిత్రంలో నటిస్తున్నారు.

ఊరు గెలిచిందా? ప్రేమ గెలిచిందా?

గంగిరెద్దుల అబ్బాయి, జోగినిగా మారిన అమ్మాయి.. ఇద్దరూ ప్రేమలో పడితే ఏం జరిగింది? వారిపై ఊరు ఎలా స్పందించింది? అనే ప్రశ్నలకు సమాధానంగా రూపొందిన పల్లెటూరి ప్రేమకథ 'శర పంజరం'. నవీన్‌కుమార్ గట్టు హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లయ కథానాయిక. ఏప్రిల్ 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించి, ట్రైలర్‌ని కూడా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'జీరో బడ్జెట్‌లో, కేవలం స్నేహితుల సహకారంతో మొదలుపెట్టిన ఈ యజ్ఞం ఇప్పుడు విడుదలకు వచ్చిందంటే మేం విజయం సాధించినట్టే లెక్క. ఈ సినిమా నిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ పాదాభివందనం చేస్తున్నాను' అని నవీన్‌కుమార్ గట్టు అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనిట్ సభ్యులతోపాటు, ఆహ్వానితులు కూడా సినిమా విజయం సాధించాలని ఆకాక్షించారు. ఈ చిత్రానికి సంగీతం మల్లిక్ ఎం.వి.కె, కెమెరా: మస్తాన్ సిరిపాటి, నిర్మాణ సహకారం: టి.గణపతిరావు.

'మేకప్‌మ్యాన్' ప్రారంభం

శ్రీకాంత్ అవుటూరి హీరోగా పరిచయమవుతున్న 'మేకప్‌మ్యాన్' చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దివాకర్ యడ్ల దర్శకుడు. అభిరామ్ మూవీస్ పతాకంపై కుమార్ మెట్టుపల్లి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు రవికుమార్ చౌదరి క్లాప్‌నివ్వగా, సాయివెంకట్ కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సినీ రంగంలో మేకప్‌మ్యాన్ పాత్ర కీలకంగా ఉంటుంది. వారి జీవితాలను ఈ సినిమాలో చూపించబోతున్నాం. త్వరలో షూటింగ్ మొదలుపెడతాం' అన్నారు. ఈ సినిమాకు మంచి కథ కుదిరిందని నిర్మాత కుమార్ మెట్టుపల్లి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా, ఎడిటర్: వాసు వర్మ, సంగీతం: ఎం.ఎం.శ్రీలేఖ, సంభాషణలు: ఘటికాచలం, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: దివాకర్ యడ్ల.

రావణుడు చెరబడితే.. సీతకు శిక్షెందుకు?

సత్యం రాజేశ్ కథానాయకుడిగా రూపొందిన ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్ 'టెనెంట్'. వై.యుగంధర్ దర్శకుడు. మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మాత. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. నటుడు ప్రియదర్శి ఈ వేడుకకు అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్‌చేసి, చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'నిన్ను నమ్మి వచ్చిన అమ్మాయిని నువ్వే చంపేయడమేంటి?' అని పోలీస్‌ఆఫీసర్ గెటప్‌లో ఉన్న ఎస్తేర్ ప్రశ్నించగా, 'రావణాసురుడు సీతని చెరబడితే.. శిక్ష సీతకెందుకు పడింది?' అని సత్యం రాజేశ్ ఎదురు ప్రశ్నించడం ట్రైలర్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్న అంశం. 'ఈ కథను యుగంధర్ ఎంత అద్భుతంగా చెప్పాడో, అంతే అద్భుతంగా మలిచాడు. డబ్బింగ్ చెబుతున్నప్పుడు క్లైమాక్స్‌లో కన్నీళ్లు వచ్చాయి. నిర్మాత సినిమాను ప్రేమించి చేశారు. నటీనటులంతా పోటీపడి నటించారు. అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అని చెప్పారు. స్త్రీలకు బాగా కనెక్టయ్యే కథ ఇదని, నిర్మాతలోని రాజీలేని గుణం సినిమా బాగా రావడానికి దోహదపడిందని, సాంకేతికంగా అన్ని విభాగాలూ ఆకట్టుకుంటాయని దర్శకుడు చెప్పారు. 'బలగం, కాంతారా చిత్రాల్లా సహజత్వంతో కూడుకున్న సినిమా ఇది. ఇందులో ఎమోషన్స్ అద్భుతంగా ఉంటాయి.' అని నిర్మాత తెలిపారు.

వాటిని తలకెక్కించుకోకూడదు

'అవకాశాన్ని మించిన అదృష్టం వేరొకటి వుండదు' అంటున్నది కన్నడ కస్తూరి రష్మిక మందన్నా. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన స్టార్‌డమ్ గురించి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది రష్మిక. 'నా కంటే అందమైన అమ్మాయిలు.. తెలివైన అమ్మాయిలు.. బాగా నటించగలిగిన అమ్మాయిలు చాలామంది అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. వారక్కడ, నేనిక్కడ ఉండటానికి కారణం కేవలం అదృష్టం. ఆ అదృష్టం వల్లే నాకు అవకాశాలు వచ్చాయి. నిరూపించుకోవాలనే ప్రయత్నం నాలో మొదలైంది. ఆ ప్రయత్నమే నన్ను ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ విషయంలో నన్ను గుర్తించిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి.' అని రష్మిక అన్నారు. ఇంకా మాట్లాడుతూ 'జయాజయాలనేవి ఏ రంగంలోనైనా సహజం. వాటిని తలకెక్కించుకోకూడదు. ఆ ప్రభావం మనసుపై పడుతుంది. ఇక జీవితంలో ముందుకెళ్లలేం. అది పతనానికి హేతువు' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక.

సందేశాత్మక కథతో 'కాప్'

రవిశంకర్ ప్రధాన పాత్రలో నిఖిల్, రాజశేఖర్, తేజ హీరోలుగా నటిస్తున్న చిత్రం 'కాప్'. బి.సోమసుందరం దర్శకత్వం వహిస్తున్నారు. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'వాణిజ్య అంశాలు కలబోసిన పొలిటికల్ సెటైర్ మూవీ ఇది. సమాజానికి ఉపయుక్తమయ్యే చక్కటి సందేశం ఉంటుంది. కథలో కొత్తదనం ఆకట్టుకుంటుంది' అన్నారు. యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే కథాంశమిదని హీరోలు నిఖిల్, రాజశేఖర్ పేర్కొన్నారు. ముప్పై రోజుల్లో చిత్రాన్ని పూర్తి చేశామని నిర్మాత మాధవన్ సురేష్ తెలిపారు. హరీష్‌రాయ్, క్రేన్ మనోహర్, జయచంద్ర, సోనీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అల్లికట్టి, సంగీతం: మిలన్ జోషి, నిర్మాత: మాధవన్ సురేష్, కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: బి.సోమసుందరం.

వినోదభరితంగా 'కొంచెం హట్కే'

గురుచరణ్, కృష్ణ మంజూష ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కొంచెం హట్కే'. అభిమాన థియేటర్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రానికి కృష్ణ రావూరి దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకురాలు నందినీరెడ్డి మాట్లాడుతూ.. ట్రైలర్ ఆసాంతం వినోదభరితంగా ఉందని, ఆసక్తికరమైన కథతో చిత్రాన్ని తెరకెక్కించారని చెప్పింది. ఓ మిత్రబృందం సినిమా తీసే ప్రయత్నాల నేపథ్యంలో కథ నడుస్తుందని, విభిన్నమైన కాన్సెప్ట్ ఇదని దర్శకుడు అవినాష్ తెలిపారు. అందరిని నవ్వించే చిత్రమిదని, సినిమా నేపథ్య కథతో మెప్పిస్తుందని గురుచరణ్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అనిల్ మల్లెల, సంగీతం: కె.ఎం.రాధాకృష్ణన్, దర్శకత్వం: అనివాష్ కుమార్.

15కోట్ల పారితోషికం

రణబీర్‌కపూర్ రాముడి పాత్రలో నితేష్ తివారి దర్శకత్వంలో పౌరాణిక ఇతిహాసం 'రామాయణ' తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. సాయిపల్లవి సీత పాత్రలో నటించనుంది. ఇటీవలే ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ముంబయిలో వేసిన అయోధ్య సెట్‌లో కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. జూలైలో ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టబోతున్నది సాయిపల్లవి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం సాయిపల్లవి 15 కోట్ల భారీ పారితోషికం తీసుకోనున్నట్లు తెలిసింది. మూడు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఒక్కో భాగానికి సాయిపల్లవి ఐదు కోట్ల రెమ్యునరేషన్‌ను స్వీకరించనుందని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. సీత పాత్రకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా సాయిపల్లవి భారీ మొత్తంలో పారితోషికాన్ని డిమాండ్ చేసిందని అంటున్నారు.